క్లుప్తంగా

25న జాబ్‌మేళా

రైల్వేకోడూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని గురువారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. ముందుగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో 18 కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేయనున్నట్టు పేర్కొన్నారు. అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాలో టెక్ మహీంద్ర, అరబిందో ఫార్మా, బైజూస్, కియా మోటర్స్, గ్రీన్‌టెక్, ఐసిఐసిఐ బ్యాంకు, ఎస్బీఐ కార్డ్స్, అమరరాజా బ్యాటరీస్ లాంటి కంపెనీలు వస్తున్నాయన్నారు. వివరాలకు 70936 18420, 88977 76368 నంబర్లను సంప్రదించాలని కోరారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం


పీర్లమకాన్‌లో ప్రార్థనలు చేస్తున్న భక్తులు

చిన్నమండెం : ఉమ్మడి కడప జిల్లాలోనే ప్రసిద్ధి గాంచిన మొహర్రం వేడుకలు గురువారం చిన్నమండెం మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పీర్లమకాన్‌లో ఉంచిన పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. పలువురు భక్తులు పీర్లమకాన్‌కు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

23న ఉచిత వైద్యశిబిరం

రాజంపేట : పట్టణంలోని నూనివారిపల్లె నలంద రోడ్డులోని తోట రామయ్య క్లీనిక్‌లో ఈ నెల 23న ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకుడు రామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతికి చెందిన రేడియంట్ హాస్పిటల్(పల్మనాలజి అండ్ మల్టీ స్పెషాలిటీ)కు చెందిన డా.రెడ్డివరప్రసాద్ బాబు వైద్యశిబిరానికి హాజరై బీపీ, షుగురు, ఎముకల పటుత్వం, లంగ్స్ కెపాసిటీ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. వైద్యశిబిరం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 వరకు ఉంటుందన్నారు. 9515170323 నెంబరుకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

బాలికలకు రక్త నిర్ధారణ పరీక్షలు


బాలికలకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

లక్కిరెడ్డిపల్లె : ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో బాలికలకు కోనంపేట వైద్య సిబ్బంది గురువారం రక్తపరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ తక్కువ ఉన్నవారికి ఐరన్ ఫోలిక్ మాత్రలను వేసినట్టు ఎంఎల్‌హెచ్‌పీ కుమారి తెలిపారు. అలాగే హిమోగ్లోబిన్ మెరుగుదలకు పలు సూచనలు చేశారు. ఐఎఫ్ఏ పర్యవేక్షకులు సుబేయ ఖాటున్, ఉమామహేశ్వరి, ఆశ కార్యకర్తలు, పీడీ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకళలో అన్నమాచార్య ఫార్మసీ విద్యార్థిని ప్రతిభ

రాజంపేట : నెహ్రూ యువకేంద్రం జిల్లాలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా యువ ఉత్సవంలో భాగంగా నిర్వహించిన జిల్లా స్థాయి చిత్రకళ పోటీలలో అన్నమాచార్య ఫార్మసీ విద్యార్థిని పూజిత బహుమతిని సాధించింది. ఈమేరకు గురువారం ఏఐటీఎస్ అధినేత చొప్పాగంగిరెడ్డి అభినందించారు.

ఓటరు నమోదుపై పార్టీల ప్రతినిధులతో సమావేశం

రైల్వేకోడూరు : ఓటరు జాబితాలో ఓటరు నమోదు మార్పు చేర్పులకై నిర్వహిస్తున్న స్పెషల్ కార్యక్రమాన్ని ఓటర్లతోపాటు రాజకీయ పార్టీలు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి రామ్మోహన్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు ఓటరు జాబితాను సవరణ చేస్తూ ఉంటుందన్నారు. అన్ని పొలిటికల్ పార్టీలు ప్రత్యేకంగా దృష్టి సారించి బూత్ లెవల్ అధికారులకు సహకరించాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణ

పెనగలూరు : ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా పి.రామకృష్ణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పెనగలూరు మండలంలో మారుమూల గ్రామమైన జట్టివారిపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేయడం పట్ల ఎస్టీయూ మండలాధ్యక్షుడు కె.యానాదయ్య, ప్రధాన కార్యదర్శి జయరామయ్య, ఆర్థిక కార్యదర్శి రాములు, రాష్ట్రకౌన్సిలర్ నల్లగట్ల గోపాల్ రెడ్డి, పుచ్చకాయల ఎల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అశోక్ కుమార్, రీజనల్ కో-కన్వీనర్ శివారెడ్డి, రాఘవరెడ్డిలతోపాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

జగనన్న సురక్ష బృహత్తర కార్యక్రమం

- ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి అండగా నిలవాలి
- ఎమ్మెల్యేలు మేడా, గడికోట, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి


రాయచోటి టౌన్: వీరబల్లె మండలంలో ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి ఆధ్వర్యంలో..


రాజంపేట టౌన్: ధృవీకరణ పత్రాన్ని ఇస్తున్న ఆకేపాటి, మేడాలు


రామాపురం: ధృవపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాజంపేట టౌన్ : జగనన్న సురక్ష బృహత్తర కార్యక్రమం అని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. మండలంలోని ఆకేపాడులో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొని అర్హులైన వారికి వివిధ రకాల సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా పంపిణీ చేస్తున్న కొన్ని సర్టిఫికెట్లు జీవితాంతం ఉపయోగపడగలవని తెలిపారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా, ఏ మాత్రం శ్రమ లేకుండా ప్రజలకు అవసరమయ్యే సర్టిఫికెట్లను ఇస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో చిన్న సర్టిఫికెట్ కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. అయితే జగన్ ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటికి వచ్చి ప్రజలకు అవసరమయ్యే సర్టిఫికెట్లను అందజేస్తున్నారని తెలిపారు. ఎప్పుడూ ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే సీఎం జగన్‌కు ప్రజలు అండగా ఉండాలని కోరారు. తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎంపీడీఓ ఫణిరాజకుమారి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకేపాటి మురళీరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌ఛార్జ్ వి.గంగిరెడ్డి, మండల కో-ఆప్షన్ మెంబర్ గౌస్‌బాషా, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకుడు దాసరి పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటంలో..

సిద్దవటం : పేద ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. మండలంలోని మాచుపల్లె గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మాచుపల్లె గ్రామ సచివాలయ పరిధిలో ఉన్న మొత్తం 1019 ఇళ్లను వాలంటీర్లు సర్వే పూర్తి చేసి అర్హులైన 240 ఆదాయ, 242 మందికి కుల ధృవీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే, స్థానిక ప్రజా ప్రతినిధులు అందజేశారు. జెడ్పీటీసీ ఉపాసి శ్రీకాంత్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జగదీష్‌కుమార్‌రెడ్డి, ఉప మండలాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ మదుసూధన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, వైఎస్సాసీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లె (రాయచోటి టౌన్): జగనన్న సురక్ష పేదలకు వరంలాంటిదని వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని వీరబల్లె, తాటికుంటపల్లెలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి అర్హులైన వారికి 11 రకాల సర్టిఫికెట్లు అందజేశారు. సర్పంచ్ గోపినాథరెడ్డి, జెడ్పీటీసీ శివరాం, ఎంపీటీసీ పురుషోత్తమరెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, వీఆర్ విద్యాసంస్థల అధినేత వీఆర్‌రెడ్డి, వీరనాగిరెడ్డి, తహసీల్దార్ మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ మల్లీశ్వరి, అధికారులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు : ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వైస్ ఎంపీపీ కొండూరు విజయ్ రెడ్డి అన్నారు. గురువారం గట్టువారిపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం పెనగలూరు, కొండూరు సురక్ష కార్యక్రమాలలో 1315 ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీపీ సౌందర్య, సర్పంచ్ రామాంజులమ్మ, ఎంపీడీఓ వరప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమణ, ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, ఏఈ పద్మ భూషన్ రెడ్డి, సెక్రటరీ సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ప్రజలకు శ్రీరామరక్ష : ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : జగనన్న సురక్ష ప్రజలకు శ్రీరామ రక్ష అని అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన జగనన్న సురక్ష క్యాంపులో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. సమావేశానుద్దేశించి మాట్లాడుతూ వంద శాతం అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న కార్యక్రమాలను కొనసాగింపుగా రాష్ట్రంలో మిగిలిన 1 శాతం మంది ప్రజల్లో ఎవరైనా లబ్ధిదారులు ఉంటే వారికి పథకాలను అందించడంతోపాటు అవసరమైన ధ్రువపత్రాలను అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బసిరెడ్డి, మాజీ ఎంపీపీ నారాయణ, సింగల్‌విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, సర్పంచ్ రామాంజులు, వెంకటరెడ్డి, మునీర్, అయూబ్‌ఖాన్, శివయ్య, నాయకులు పాల్గొన్నారు.

కడప జిల్లా జట్టుకు నందలూరు క్రికెటర్స్

రాజంపేట : అండర్-19 సీఏవైడీ కడప జిల్లా క్రికెట్ జట్టుకు అన్నమయ్య జిల్లాలోని నందలూరు సీఏవైడీ సబ్‌సెంటర్ నుంచి ముగ్గురు క్రికెటర్స్ ఎంపికయ్యారు. ఈ మేరకు హెడ్‌కోచ్ గయాజ్, అసిస్టెంట్ కోచ్ ఫిరోజ్‌ఖాన్‌లోడిలు తెలిపారు. జిల్లా క్రికెట్ జట్టు ఎంపికకు జరిగిన రెండు ప్రాబబుల్స్ మ్యాచ్‌లో సీఏవైడీ సబ్‌సెంటర్‌కు చెందిన అనిలా (వికెట్‌కీపర్, బ్యాటర్), రిషిత (బ్యాటర్), రూప (బ్యాటర్)లు ప్రతిభను కనబరిచారన్నారు. నెల్లూరు జిల్లా వెంకటగిరిలో జరిగే ఉమెన్స్ అండర్-19 క్రికెట్ మ్యాచ్‌లలో వీరు పాల్గొంటారు. పోటీల్లో మంచిగా రాణించి రాష్ట్ర, జాతీయస్థాయికి చేరుకోవాలని కోచ్ గయాజ్, ఏసీ ఫిరోజ్‌ఖాన్‌లోడి, ట్రైనర్ శివకోటి ఆశాభావం వ్యక్తం చేశారు.

ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

రాయచోటి అర్బన్ : గిరిజన గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ (ఏఐఎస్‌బీ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాలేషాలు డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్‌బీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 190 గిరిజన గురుకుల పాఠశాలల్లో తగినంత ఉపాధ్యాయులు లేక ఉత్తీర్ణత శాతం తగ్గిపోతోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి పాఠశాలలో 3,4 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీగా ఉన్నాయని వాటిని ప్రభుత్వం వెంటనే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతులలో భర్తీచేసి పేద విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. సమావేశంలో రాయచోటి ఏఐఎస్‌బీ నేతలు సమీర్, రమణలు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు


రైతులకు వ్యవసాయ పనిముట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

సిద్దవటం : మండలంలోని జ్యోతి గ్రామంలో గురువారం రైతులకు వ్యవసాయ పనిముట్లను సబ్సిడీతో పంపిణీ చేశామని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా నీటి యాజమాన్య సంస్థ, వైఎస్ఆర్ జిల్లా ఉత్పాదకత (పి.ఎస్.ఐ.) నిధులతో రైతులకు సబ్సిడీ కింద 35 మంది రైతులకు పీవీసీ పైపులు, పెట్రోలో పంపులు, బ్యాటరీ, స్ప్రేయర్లు, 9 చెక్కల గొర్లను రైతులకు అందజేశామన్నారు. రైతులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అత్యాధునిక వ్యవసాయ పనిముట్లను 90 శాతం సబ్సిడీతో ఎస్సీ, ఎస్టీలకు, 80 శాతం సబ్సిడీతో ఓసీ, బీసీ, మైనార్టీ వారికి వాటర్ షెడ్ పథకంలో ఇస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అదనపు పీడీ నాగరత్నమ్మ, వాటర్ షెడ్ బీపీఓ వేణుగోపాల్‌రెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ జె.లక్ష్మిరెడ్డి, వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జగదీష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ జె.వెంకటమ్మ, సర్పంచ్ పి.సుబ్బమ్మ, కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ నూర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జవహర్‌బాషా, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

నివాళి

ఒంటిమిట్ట(సిద్దవటం) : మండలకేంద్రంలోని రెడ్డి వీధికి చెందిన నందకిషోర్‌రెడ్డి తండ్రి రిటైర్డు ఉపాధ్యాయుడు మేకపాటి వెంకట నరసారెడ్డి గురువారం జరిగిన దశ దినకర్మలో పాల్గొన్న ఎమ్మెల్యే మేడా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈయన వెంట వైఎస్సార్‌సీపీ సిద్దవటం మండలం ఇన్‌చార్జి మేడా మదుసూదన్‌రెడ్డి, ఒంటిమిట్టకు చెందిన ముఖ్య నాయకులు ఉన్నారు.

మెరుగైన పాలన కోసమే ప్రతి గడపకూ

- గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : జగనన్న సంక్షేమ విప్లవం కొనసాగుతోందని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అరవీడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, సర్పంచ్ రెడ్డెమ్మ, ఎంపీటీసీ క్రిష్ణవేణి రమణలతో కలసి శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామంలోని లక్కంవాండ్లపల్లె, ఉయ్యాలవాండ్లపల్లె, యల్లంపల్లె, కొత్తపల్లె, కసిరెడ్డిగారిపల్లె, అరవీడు శ్రీనగర్‌కాలనీ, దళితవాడ, మంగళపల్లె, నడింపల్లె, అరవీడు కస్పాలో ప్రతి గడపకూ వెళ్లి ప్రజా సమస్యలు ఆరా తీయడంతో పాటు ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, మరింత మెరుగైన పాలన సాగించేందుకు ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి సత్వర పరిష్కారానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను సీఎం జగన్ నాలుగేళ్ల కాలంలో 98శాతానికి పైగా పథకాలను నెరవేర్చారన్నారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. ఆదర్శంగా పారదర్శకంగా రాష్ట్రంలో పాలన కొనసాగుతోందన్నారు. పేదలు, మహిళలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పెద్దపీట వేశారని ఆయన తెలిపారు.

జగన్ హయాంలో బీసీలకు పెద్దపీట

బీసీలంటే బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదని బ్యాక్ బోన్ అని జగన్ ప్రభుత్వం నిరూపించిందన్నారు. యల్లంపల్లెలో ఇంటింటా జగనన్న పాలనపై వడ్డెరలు శ్రీకాంత్‌రెడ్డి ఎదుట హర్షం వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా అన్నింటిలో బీసీలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. జగన్‌పాలనలో ఇద్దరు వడ్డెరలను ఎమ్మెల్సీలు చేశారని, రాయచోటి నియోజకవర్గంలోనే ఇద్దరిని వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమించారని ఆయన గుర్తు చేశారు. అనంతరం అరవీడులో నూతన విలేజ్ క్లినిక్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. 65 రకాల మందులతోపాటు 67 రకాల బేసిక్ మెడికల్ ఎక్విప్‌మెంట్ అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షుడు వేదమూర్తిరెడ్డి, ఆవుల నాగభూషన్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్‌లు ఖాదర్‌మొహిద్దీన్, వెంకటరెడ్డి, కోఆప్షన్ సభ్యులు నిజాంవలి, వైఎస్సాసీపీ నాయకులు వేణుగోపాల్, బాబాపకృద్దీన్, రామ్మోహన్‌రెడ్డి, మహబూబ్‌బాషా, అహమ్మద్, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కవితా నగేష్, ఎంపీటీసీలు చంద్రప్రకాష్‌రెడ్డి, చిన్నపరెడ్డి, సర్పంచ్‌లు చెన్నకేశవరెడ్డి, ఉమాపతిరెడ్డి, ఉమాప్రభాకర్, రెడ్డెమ్మ, సచివాలయం కన్వీనర్ శంకర్‌రెడ్డి, సర్పంచ్ హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమం.. అవినీతి రహితం

- సీఎం జగన్‌ను ఆశీర్వదించండి
- గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు


పథకాల గురించి వివరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు : మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సచివాలయం 2 పరిధిలో అంకమ్మనగర్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వవిప్ కొరముట్ల మాట్లాడుతూ మహిళాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. ఏ గడపకూ వెళ్లినా వైఎస్సార్‌సీపీ అందించిన సంక్షేమ పథకాల గురించి చెబుతున్నారని పేర్కొన్నారు. నాలుగేళ్ల పాలన కాలంలో 98శాతం పైగా హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనవైపు దేశం మొత్తం చూస్తుందన్నారు. మాట తప్పని, మడమ తిప్పని మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను చేసి చూపిస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అవినీతి రహిత పాలన అందించడమే కాకుండా మీకు అందరికీ తోడు నీడగా నిలుస్తున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మీరంతా బాసటగా నిలచి దీవెనలు, ఆశీర్వాదాలు అందజేయాలని కోరారు. సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో పంజం సుకుమార్‌రెడ్డి, సుధాకర్‌రాజు, సుబ్బరామరాజు, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, జెడ్పీటీసీ రత్నమ్మ, పట్టణ అధ్యక్షుడు సిహెచ్.రమేష్, ఎంపీడీఓ జాషువా, ఎంపీటీసీలు పుష్పలత, జనార్దన్‌రాజు, బండారు మల్లికార్జునలు, వినోద్‌కన్నా, శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వీరబల్లె (రాయచోటిటౌన్) : మండలంలోని ప్రజల భూ సమస్యలపై ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని వీరబల్లె తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మహేశ్వరరెడ్డి అన్నారు. గురువారం ఆయనను మండల పరిధిలోని సానిపాయి సర్పంచ్ నేతి ఆంజనేయులు, గుర్రప్పగారిపల్లె సర్పంచ్ సుబ్బరామరాజు, ఈశ్వరయ్య, శ్రీరాముల రెడ్డిలు కలసి తమ గ్రామ సమస్యలను వివరించారు. అనంతరం శాలువాతో సన్మానించారు.

విద్యార్థులకు నగదు బహుమతుల అందజేత

పుల్లంపేట : పది, ఇంటర్ ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు గురువారం నగదు బహుమతులు అందజేశారు. స్థానిక ఎస్‌బీవీడీ సభా విద్యాసంస్థలలో జరిగిన ఈ కార్యక్రమాన్ని నూకల దశరథ రామయ్య జ్ఞాపకార్థం ఈ బహుమతులు ఇచ్చారు. పది పరీక్షలో భావన, అజీజ్ కౌసర్, అలాగే ఇంటర్‌లో బాల ఓబులమ్మ, లిఖితరెడ్డిలకు బహుమతులు అందజేసినట్లు విద్యాసంస్థల కరస్పాండెంట్ నూకల శ్రీరాములు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జె.చలమయ్య, ప్రిన్సిపాల్ అద్దెపల్లి బాలాజీరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్ రెడ్డిలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

- ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 465 మంది కంటి రోగులకు పరీక్షలు


కంటి వైద్య శిబిరానికి పెద్దసంఖ్యలో హాజరైన జనం

రామాపురం : మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తిరుపతికి చెందిన శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో వైద్యులు, సిబ్బంది కలిసి 465 రోగులను పరీక్షించి 70 మందిని కంటి ఆపరేషన్లకు సిఫారసు చేశారు. కంటి వైద్య శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ప్రారంభించారు. శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పలు సూచనలు చేశారు. అనంతరం రోగులతో మాట్లాడారు. 70 మందికి ఆపరేషన్లు నిర్వహించాల్సి ఉండగా సగం మందిని తిరుపతి ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ల చేయించి తిరిగి క్యాంపు స్థలంలో వదిలేలా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. మిగిలిన వారికి వచ్చే మంగళవారం ఆపరేషన్లు జరుపనున్నారు. రోగులకు వారి సహాయకులకు భోజన వసతిని కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోండి

లక్కిరెడ్డిపల్లె : జనవరి 1వ తేదీలోపు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఉదయ్ శంకర్ రాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని బీఎల్ఓలు, సూపర్‌వైజర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 జనవరి 1వ తేదీకి 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీ యువకులు తమ ఓటు హక్కును ఆయా గ్రామాల పరిధిలోని పోలింగ్ బూతులలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటుహక్కు ఉన్నవారు వారి ఓటరును మరొకచోటికి మార్చుకునే అవకాశం ఉందని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ రెడ్డన్న, సూపర్‌వైజర్లు శేఖర్, సమ్మత్ ఖాన్, బీఎల్ఓలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియులంతా కొరముట్ల వెంటే


మాట్లాడుతున్న సుధాకర్‌రాజు, క్షత్రియ నాయకులు

రైల్వేకోడూరు : నియోజకవర్గంలోని క్షత్రియులంతా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు వెంటే నడుస్తామని జిల్లా టూరిజం డైరెక్టర్ గుంటిమడుగు సుధాకర్‌రాజు తెలిపారు. గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నాటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నుంచి నేటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరకూ రైల్వేకోడూరులో క్షత్రియ కులస్తులకు ఎన్నో పదవులు ఇస్తూ ఉన్నతమైన గుర్తింపు ఇస్తున్నారని గుర్తుచేశారు. అలాంటిది మా వర్గంలో ఎవరో ఒకరు మాట్లాడినంత మాత్రాన పార్టీకి నష్టం జరగదని, మా ప్రాణం ఉన్నంత వరకు ఎమ్మెల్యే కొరముట్ల కోసం పనిచేస్తాం, పార్టీ కోసం పాటుపడతాం అన్నారు. అనంతరం అనంతరాజుపేట ఎంపీటీసీ జనార్దన్‌రాజు మాట్లాడుతూ కోడూరు ప్రాంతంలో కొరముట్ల క్షత్రియులకు ఉన్నత స్థానం కల్పించారన్నారు. ఉన్నత పదవులు ఇచ్చారని అలాంటిది ఆయనపైనా అభియోగాలు చేయడం చాలా దారుణమైన విషయం అన్నారు.

ఒంగోలు ఘటన దోషులను కఠినంగా శిక్షించాలి

రాయచోటి అర్బన్ : ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో మోట నవీన్ అనే గిరిజన యువకుడిపై దాడిచేయడమే కాక, తల, ముఖంపై మూత్రవిసర్జన చేసిన దోషులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని దళిత హక్కుల పోరాట సమితి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు మండెం సుధీర్ కుమార్ కోరారు. నిందితులపై తక్షణమే ఎస్సీ, ఎస్టీ నిరోధక చట్టం నమోదు చేయాలంటూ గురువారం ఆయన అర్బన్ సీఐను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోట నవీన్‌పై ఒంగోలుకు చెందిన మన్నె రామాంజనేయచౌదరి మరో ఆరుగురు కలసి దాడిచేసి తీవ్రంగా గాయపరిచి నవీన్‌పై మూత్రవిసర్జన చేశారన్నారు. ఘటనకు కారకుడైన ప్రధాన నిందితుడైన రామాంజనేయచౌదరిని పోలీసులు వెంటనే అరెస్టు చేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట డీహెచ్‌పీఎస్ జిల్లా కోశాధికారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా ఉందాం

రాజంపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉందామని రాజంపేట ముస్లింలు ముక్తకంఠంతో ఎలుగెత్తిచాటారు. గురువారం ఎస్‌ఆర్ కల్యాణ మండపంలో ముస్లిం పెద్దలు, యువకులు, ముస్లిం మైనార్టీ నేతలతో మండల కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ గౌస్‌బాషా నేతృత్వంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుల్జార్‌బాషా మాట్లాడుతూ జగనన్న పాలనలో అన్ని విధాలుగా ముస్లింలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. గౌస్‌బాషాకు మండల కో-ఆప్షన్ సభ్యుడిగా నియమించడంలో ఎమ్మెల్యే మేడా, జెడ్పీచైర్మన్ ఆకేపాటి, ఆకేపాటి మురళీరెడ్డిలకు కృతజ్ఞతలను తెలియజేశారు. కో-ఆప్షన్ సభ్యుడు గౌస్ మాట్లాడుతూ ముస్లింలకు ఏ సమస్య వచ్చినా తాను ముందుండి పరిష్కరించేందుకు అన్ని వేళలలో సిద్ధంగా ఉంటానన్నారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన వారికి రుణపడి ఉంటానన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్క ముస్లిం సోదరుడు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇందులో రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ స్టేట్ డైరక్టరు గండికోట గుల్జార్‌బాషా, రహమతియా మసీదు అధ్యక్షుడు ఇక్బాల్‌బాషా, కార్యదర్శి చాంద్‌బాషా, మాజీ మసీదు అధ్యక్షుడు మౌలానా, జామీయా మసీదు అధ్యక్షుడు హైదర్‌బాషా, ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్, అల్‌బదర్‌మసీదు కార్యదర్శి నజీర్‌బాషా, ఉపాధ్యక్షుడు నయంతుల్లా, కౌన్సిలర్ ఇనయతుల్లా, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేతలు జావిద్‌అలీ, మసూద్ అలీ, ముజఫర్ అహమ్మద్‌లు పాల్గొన్నారు.

ఆధార్ సెంటర్ పరిశీలన

పెనగలూరు : కొండూరు-2 సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్‌ను వైస్ ఎంపీపీ కె.విజయ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆధార్ సెంటర్ నిర్వాహకులతో మాట్లాడుతూ యానాదులు అధికంగా ఉన్నందున గ్రామాలకు వస్తూ పోతుంటారని, ఎవరికీ ఇబ్బందులు లేకుండా ఆధార్ కార్డులు తయారు చేసుకోవాలన్నారు. ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీపీ సౌందర్య, కొండూరు సర్పంచ్ రామాంజులమ్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోదాం నిర్మాణానికి భూమిపూజ

గాలివీడు : జగనన్న ప్రభుత్వం రైతు ప్రభుత్వమని నూలివీడు సర్పంచ్ పి.ఉమాపతిరెడ్డి అన్నారు. గురువారం నూలివీడు కస్పాలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మంజూరైన రైతు గోదాం నిర్మాణానికి భూమిపూజ చేశారు. రైతులు పండించిన పంటలను నిల్వ ఉంచేందుకు ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి కృషితో గోదాం మంజూరు కావడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.